ఖమ్మంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్

42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే..

- లేదంటే 'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ పిలుపు

ఖమ్మం, జూన్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి భూస్థాపితం చేయాలని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. 'బీసీ రిజర్వేషన్లు – బహుజన రాజ్యాధికారం' పేరిట పూలే, అంబేద్కర్ అధ్యయన వేదిక అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎంబీ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన సదస్సుల్లో రాజారాం మాట్లాడారు. మండల్ కమిషన్ వరకు బీసీలకు అడుగడుగునా కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని విమర్శించారు. కులగణన చేసి దేశాన్ని ఎక్స్‌రే తీస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆ మాట మీద ఎందుకు నిలబడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకమాట, అసెంబ్లీ ఎన్నికల తరువాత మరొకమాట మాట్లాడుతూ బీసీలను మోసం చేస్తున్నదని విమర్శించారు. 9వ షెడ్యూల్ చేర్చిన తర్వాతే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికలకు ముందు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ.. తక్షణమే చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీలంతా ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జస్టిస్ చంద్రకుమార్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూరు గ్రామ శివారులోని శ్రీ రాజరాజేశ్వర ప్రాజెక్టు కట్టపై కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట, జూన్ 10 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామ శివారులోని శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయం కట్టపై బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, పార్టీ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని బీడు భూములను కాళేశ్వరం నీటితో పచ్చని పంట పొలాలుగా మార్చిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ ఓర్వలేని తనమేనని మండిపడ్డారు. రాష్ట్రంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతులను రాజులను చేయడానికి కేసీఆర్ చేసిన కష్టాన్ని ఎవరూ మరిచిపోరని పేర్కొన్నారు. కేసీఆర్‌పై కక్షగట్టి, ఆయన ప్రతిష్ఠను దిగజార్చాలనే రేవంత్‌రెడ్డి నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. మండుటెండల్లోనూ గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లి చెరువులు, కుంటలు మత్తడులు దుంకించినందుకు నోటీసులు ఇచ్చారా? అని ప్రశ్నించారు.



సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఘనంగా 'రావుల' జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో చంద్రశేఖర్‌రెడ్డితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో జీవించాలని, సుదీర్ఘకాలం ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. తన జన్మదినం సందర్భంగా రావుల చంద్రశేఖర్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

తనను కలిసిన గద్వాల సీడ్ పత్తి రైతులకు కేటీఆర్ భరోసా • అసెంబ్లీలో లేవనెత్తుతాం: హరీశ్‌రావు

హైదరాబాద్ జూన్ 10 (నమస్తే తెలంగాణ): 'అధైర్య పడొద్దు... అండగా ఉంటాం... మీకు న్యాయం జరిగేలా చూస్తాం...' అని జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన సీడ్ పత్తి సాగు చేసిన రైతులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు భరోసా ఇచ్చారు. మంగళవారం బీఆర్ఎస్ నేత కురవ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు రైతులు నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిశారు. సీడ్ కంపెనీలు ఇచ్చిన విత్తనాలే సాగు చేశామని, అయితే పంట ఫెయిలైందని.. కొనబోమని.. పరిహారం ఇవ్వబోమని సదరు కంపెనీల బాధ్యులు చెప్తున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీల తీరుతో తమ బతుకులు రోడ్డునపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో కేటీఆర్ వెంటనే వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫోన్ చేశారు. సీడ్ కంపెనీల నిర్వాహకులు, రైతులతో సమావేశం ఏర్పాటుచేసి సీడ్ పంట వేసిన రైతులకు నగదు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న గద్వాల జిల్లాకు చెందిన బాధిత రైతులు

సీడ్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి: కురువ

గద్వాల జిల్లాలోని రైతులను మోసం చేసిన సీడ్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత కురువ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బాధిత రైతులతో కలిసి తెలంగాణభవన్‌లో మీడియాతో మాటాడుతూ... సీడ్ కంపెనీలు దగా చేయడంతో వందలాది మంది రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ల్యాబ్‌లో పరీక్షించకుండానే సీడ్ కంపెనీల బాధ్యులు ఏకపక్షంగా పంట ఫెయిలైందని నిర్ధారణకు రావడంపై ఆక్షేపణ వ్యక్తంచేశారు. పండించిన పంటను కొనకపోవడం, పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అవసరమైతే ప్రత్యేక చట్టం చేయాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు సీడ్ కంపెనీలతో కుమ్మక్కై రైతులను నిలువునా ముంచుతున్నారని ఆరోపించారు. వెంటనే సీడ్ పత్తిని కొనుగోలు చేయాలని, లేదా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వారితో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వానికి లేఖ రాస్తా: హరీశ్‌రావు

సీడ్ పత్తి రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అభయమిచ్చారు. తనను కలిసిన బాధిత రైతులతో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యను లేవనెత్తి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. రైతులు అధైర్యపడొద్దని సూచించారు. అంతకుముందు సీడ్ పత్తి రైతులు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిశారు. ప్రత్యేక చట్టం చేసి తమను ఆదుకోవాలని కోరారు. దీనిపై కోదండరెడ్డి స్పందిస్తూ.. ఈ నెలాఖరునాటికి ఆమోదించనున్న కొత్త వ్యవసాయ సీడ్ చట్టం ముసాయిదాలో పొందుపరిచి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

లోకం పోకడ



వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	44.7°c	26.1°c
వరంగల్	39.0°c	27.0°c
నల్లగొండ	39.0°c	23.0°c
కరీంనగర్	37.0°c	28.0°c
రంగారెడ్డి	36.2°c	20.6°c
ఖమ్మం	35.0°c	25.0°c
మహబూబ్‌నగర్	35.0°c	24.0°c
నిజామాబాద్	32.4°c	22.6°c
హైదరాబాద్	32.0°c	24.0°c
మెదక్	30.5°c	23.6°c

3రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు
- హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో మూడ్రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణశాఖ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తుండగా, మరింత జోరందుకోనున్నాయని పేర్కొన్నది. ఈనెలలో రెండు అల్పపీడనాలు ఏర్పడుతుండటం, వీటికి రుతుపవనాలు తోడు కానున్నట్టు తెలిపింది. రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో దక్షిణాది రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. ముఖ్యంగా కర్ణాటకలో ఈనెల 12నుంచి 15వరకు కుండపోత వర్షాలు కురుస్తాయని, దీంతో వరదలు సంభవించే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. తమిళనాడు, పుదుచ్చేరి, గోవాలో కూడా ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉన్నదని తెలిపింది. మంగళవారం నుంచి 13 మధ్య రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. బుధ, గురువారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ–గద్వాల్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వివరించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపింది. మంగళవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ–గద్వాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న–సిరిసిల్ల, భద్రాద్రి–కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి–భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసినట్టు వాతావరణశాఖ వెల్లడించింది.

కల్యాణలక్ష్మితో కాలేజీకి అడుగులు!

మొదటిపేజీ తరువాయి...

పెరగ్గా, పురుషులు ఏడుశాతం పెరిగారు. యూనివర్సిటీ ఎన్‌రోల్‌మెంట్‌లో 42 శాతం షెడ్యూల్డ్ కులాల వారే ఉంటున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో బాల్య వివాహాలు నిలిచిపోయినట్టు నివేదిక వెల్లడించింది.

మరికొన్ని ముఖ్యాంశాలిలా..

- పదో తరగతి (సెకండరీ స్కూల్) విద్యను పూర్తి చేసే వారి శాతం కూడా క్రమంగా పెరుగుతున్నది. 2016లో ఇది 74 శాతముంటే 2023లో 83 శాతానికి చేరింది.
- 22 ఏండ్లలోపు వారిలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారి శాతంలోనూ పురోగతి కనిపిస్తున్నది. ఇంటర్ ఉత్తీర్ణత శాతం 53 శాతం నుంచి 61 శాతానికి పెరిగింది. అమ్మాయిల శాతం 46 నుంచి 55 శాతానికి, అబ్బాయిలు ఉత్తీర్ణత శాతం 57 నుంచి 62 శాతానికి చేరింది.
- టెక్నికల్ ఎడ్యుకేషన్, వొకేషనల్ ఎడ్యుకేషన్‌లో నమోదు 2016లో 11 శాతముంటే, 2023లో 14 శాతానికి పెరిగింది.
- గత ఏడేండ్లలో ఇంటర్నెట్ వినియోగం అమాంతం పెరిగింది. ఇంటర్నెట్ వినియోగం ఫ్రీక్వెన్సీ 2016లో కేవలం 6 శాతం ఉండగా, 2023లో అది 86 శాతానికి పెరిగింది.
- సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) కోర్సుల వైపే విద్యార్థులు మళ్లుతున్నారు. 2016లో కేవలం 19 శాతం మంది స్టెమ్ కోర్సుల్లో చేరితే 2023లో ఇది 37 శాతానికి చేరుకున్నది.
- యూనివర్సిటీ ఎన్‌రోల్‌మెంట్ అర్బన్ నుంచి 65 శాతం ఎన్‌రోల్‌మెంట్ ఉంటే, గ్రామీణ ప్రాంతాల నుంచి 43 శాతంగా ఉన్నది.

వర్సిటీ విద్యను పూర్తిచేస్తున్న వారు (శాతాల్లో)

	2016	2023	పెరుగుదల
మహిళలు	32.93	45.59	12.66
పురుషులు	45.12	52.30	7.18

ఎనికెపల్లిని మరో లగచర్ల చేయకండి!

- రైతుల ఒత్తిడితో రంగారెడ్డి కలెక్టర్‌కు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఫోన్
- భూములు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు
- మీదేమైనా ఉంటే సీఎంతో మాట్లాడండి అంటూ కలెక్టర్ రిప్లై

నిరుపేద రైతులు సాగు చేసుకొని బతుకుతున్న భూములను తీసుకొని ఎనికెపల్లిని మరో లగచర్లను చేయొద్దు.. వాళ్ల భూముల జోలికి రాకండి.
– రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఆ భూములను తీసుకోవాలని ప్రభుత్వం నుంచి మాకు స్పష్టమైన ఆదేశాలున్నయి. మీదేమైనా ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడండి – కలెక్టర్ సమాధానం

మొయినాబాద్, జూన్10 : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనికెపల్లి భూముల వ్యవహారం మరింత క్లిష్టతరంగా మారుతున్నది. దశాబ్దాలుగా నమ్ముకున్న తమ భూములను కాపాడుకునేందుకు నిరుపేద రైతులు కంటిమీద కునుకు లేకుండా తిరుగుతున్నారు. ఇందులో భాగంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను సోమవారం ఆయన నివాసంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆ తర్వాత మండల పరిషత్ కార్యాలయంలోనూ కలిసి ఎలాగైనా తమ భూములను కాపాడాలని కోరారు. గతంలోనూ ముందుగానే తమ భూములను గుంజుకోబోతున్నారని చెప్పినా సీఎంతో మాట్లాడి, సమస్య పరిష్కరిస్తామన్నారని, అయినా అధికారులు వచ్చి భూములను స్వాధీనం చేసుకున్నారని ఆవేదన చెందారు. రైతుల ఒత్తిడి మేరకు కాలె యాదయ్య రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేశారు.

రైతుల భూములను గుంజుకుంటే ప్రభుత్వానికే చెడ్డపేరు

రైతుల గోడును విన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి ఎనికెపల్లి భూముల గురించి మాట్లాడారు. రైతుల భూములను గుంజుకుని ఎనికెపల్లిని మరో లగచర్ల చేయొద్దని చెప్పారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను తీసుకోవడంతో రైతులు ఆందోళనకు చెందుతున్నారని, స్థానికంగా తనతో పాటు ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందని కలెక్టర్‌తో అన్నట్టు గ్రామస్తులు తెలిపారు. వాళ్ల భూములు తీసుకోవద్దని, గోశాలకు మరెక్కడైనా భూములు చూపించాలని సూచించారు. అయితే ఎనికెపల్లి భూములు తీసుకోవాలని ప్రభుత్వం నుంచే స్పష్టమైన ఆదేశాలున్నాయని ఎమ్మెల్యేకు కలెక్టర్ సమాధానమిచ్చినట్టు గ్రామస్తులు తెలిపారు. భూముల విషయంలో ఏదైనా మాట్లాడాలనుకుంటే ముఖ్యమంత్రితో మాట్లాడాల్సిందిగా కలెక్టర్ చెప్పారని తెలిపారు. దీంతో సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని భూబాధితులకు ఎమ్మెల్యే చెప్పారు.

నిరాడంబరంగా గోరటి కుమార్తె వివాహం

హైదరాబాద్, జూన్10 (నమస్తే తెలంగాణ): ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న రెండవ కూతురు తేజస్వి వివాహం అత్యంత నిరాడంబరంగా జరిగింది. అమెరికాలో స్థిరపడిన కేరళ రాష్ట్రం ఎర్నాకులం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చిత్రేను మంగళవారం అమెరికాలోని టెక్సాస్‌లో అతికొద్ది కుటుంబ సభ్యుల సమక్షంలో తేజస్వి వివాహమాడారు. ఒకే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న వీరు.. పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లి కొడుకు చిత్రే తండ్రి జాన్ హెడీ అభ్యుదయ ప్రగతిశీల సాహితీకారుడు. ఈనేపథ్యంలోనే గోరటి వెంకన్న వారి వివాహానికి అంగీకరించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. పెళ్లి ఫొటోలను గోరటి వెంకన్న సోషల్ మీడియా వేదికగా పంచుకోగా.. అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పెట్టుడే!

- కేంద్రమే ప్రోత్సహిస్తున్నది.. అదేబాటలో మేము
- రైతులను ఒప్పించినం.. త్వరలో పనులు చేస్తం
- బీఆర్ఎస్ రెచ్చగొట్టినందునే రైతుల ఆందోళన
- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ స్పష్టీకరణ

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ప్లాంటును ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేస్తామని, ఇందుకు ఎలాంటి అడ్డంకులూ లేవని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కొద్ది రోజులు ఆలస్యమవుతుంది తప్ప ప్లాంటు ఏర్పాటు ఖాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్లాంటును అడ్డుకునేందుకు రైతులను, స్థానికులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇటీవల పెద్ద ధన్వాడలో ఇథనాల్ ప్లాంటు ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతులు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి శ్రీధర్ బాబు పెట్టుబడుల అంశంపై సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇథనాల్ ప్లాంటు ఏర్పాటు తథ్యమని చెప్పారు. సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే సంప్రదాయేతర ఇంధన రంగాన్ని ప్రోత్సహిస్తున్నదని, ఇందులో భాగంగా ఇథనాల్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు మద్దతునిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇథనాల్ ప్లాంట్ల ఏర్పాటుకు సమర్థిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇథనాల్ ప్లాంటుతో కాలుష్యం ఏర్పడే అవకాశమే లేదని, అది అత్యాధునిక పద్ధతుల్లో నిర్మిస్తారని చెప్పారు. ప్లాంటుకు సంబంధించిన అంశాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించామని, వారు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. రైతులు, విలేకరులపై కేసులు నమోదు చేసిన అంశంపై మంత్రి మాట్లాడుతూ దీని వెనుక రాజకీయ ఎజెండా ఏమీ లేదని, చట్టాన్ని ఉల్లంఘించనవారిపై చర్యలు ఉంటాయని చెప్పారు. ఇథనాల్ ప్లాంటు అంశాన్ని రాజకీయం చేయవద్దని, రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయడం ద్వారా పెట్టుబడులను అడ్డుకునే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తిచేశారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వారు తీసుకున్న అనేక నిర్ణయాలకు కాంగ్రెస్ మద్దతు తెలిపిందని, పారిశ్రామికీకరణను అడ్డుకునే ప్రయత్నం ఏనాడూ చేయలేదని చెప్పుకొచ్చారు. గతంలో కాంగ్రెస్ పార్టీ సైతం ఇథనాల్ ప్లాంట్లను వ్యతిరేకించినట్టు విలేకరులు గుర్తుచేయగా, తాము కాలంచెల్లిన టెక్నాలజీతో ఏర్పాటుచేసే ఇథనాల్ ప్లాంట్లను మాత్రమే వ్యతిరేకించామని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్లాంట్లను కాదని మంత్రి సమర్థించుకున్నారు. పెద్ద ధన్వాడలో ఇప్పటికీ పోలీస్ పికెట్ కొనసాగుతున్నది. గ్రామస్థులను కలిసేందుకు ఎవరైనా నాయకులు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా పోలీసులు అడ్డుకుంటున్నారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సోమవారం గ్రామస్థులను కలిసేందుకు వెళ్తుండగా పోలీసులు మధ్యలోనే అడ్డుకొని అరెస్టు చేశారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దయితేనే అసలైన పండుగ

- నేడు ఏరువాక పౌర్ణమి పండుగ చేసుకోం
- పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ రైతుల సమిష్టి నిర్ణయం

రాజోళి, జూన్ 10: 'మా గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దయితేనే మాకు అసలైన పండుగ. అప్పటివరకు ఏరువాక పౌర్ణమిని జరుపుకోం' అని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాల రైతులు తీర్మానించారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలో రైతులు సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ రద్దయ్యే వరకు ఏ పండుగ కూడా చేసుకోద్దని సమిష్టిగా నిర్ణయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కంపెనీ వద్దంటూ నిరసన తెలియజేసిన తమ గ్రామ ప్రజలను అక్రమ కేసుల్లో ఇరికించి జైళ్లకు పంపితే, తాము సంతోషంగా పండుగ ఎలా జరుపుకొంటామని ప్రశ్నించారు. అరెస్టయిన వారు విడుదలయ్యాకే తమకు అసలైన పండుగ అని పేర్కొన్నారు. వెంటనే ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులే అని భావించే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

గద్వాల కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం

గద్వాల, జూన్ 10 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్దధన్వాడ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతోపాటు సభ్యులు ప్రవీణ్, నీలాదేవి, లక్ష్మీనారాయణ, రాంబాబు, శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేసే సమయంలో ప్రజల అభిప్రాయాలు సేకరించారా? గ్రామ సభలు నిర్వహించారా? అని కలెక్టర్‌ను ప్రశ్నించారు. పరిశ్రమకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. రాజోళి మండలం నసనూర్ శివారులో సర్వే నంబర్ 35లో తమకు భూమి ఉన్నదని.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తమకు న్యాయం చేయకుండా రాజోళి ఎస్సై కులం పేరుతో దూషించి తనపై తప్పుడు కేసు పెట్టేందుకు యత్నించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేశాడని చిన్నధన్వాడకు చెందిన రాజశేఖర్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లాడు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే ప్రమాదం పొంచి ఉన్నదని, అందుకే 12 గ్రామాల ప్రజలు వ్యతిరేకించినా కంపెనీ యాజమాన్యం దాడులకు ప్రేరేపించడంతో పలువురు గాయపడ్డారని, దాడి చేసిన వారిని వదిలి, రైతులపై అక్రమ కేసులు నమోదు చేసిన రాజోళి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సైపై వచ్చిన ఆరోపణలపై విచారణ అధికారిగా గద్వాల డీఎస్పీ మొగులయ్యను నియమిస్తున్నట్టు చైర్మన్ వెంకటయ్య తెలిపారు.

బాలికపై 13మంది లైంగికదాడి

ఆలస్యంగా వెలుగులోకి.. ఏడుగురి నిందితుల అరెస్ట్

హైదరాబాద్ జూన్ 10 (నమస్తే తెలంగాణ): దళిత బాలికపై రెండేండ్లుగా 13మంది లైంగికదాడికి పాల్పడగా, మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అమానవీయ సంఘటన ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయిజిల్లా రామగిరిలో చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రామగిరి ఠాణాలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి.. పరారీలో ఉన్న ఆరుగురి కోసం గాలిస్తున్నారు. కాగా, లైంగిక దాడికి ఒడిగట్టిన వారిలో మైనర్లతోపాటు, 50 ఏండ్ల పైబడిన వారు ఉన్నట్టు తెలుస్తున్నది.